# కులగోత్రాలు

యేలూరిపాటి ఆంజనేయశర్మ, **Bridgewater, NJ**

ఇదేదో సినిమా పేరనుకునేరు! కాదు. కులము, గోత్రములను గురించిన చిన్న వివరణ.

కులము అంటే వంశము అని అర్థం. రఘుకులతిలక, ఇక్ష్వాకుకులతిలక యదుకులతిలక, ఇనకులోద్భవ, కురు కులోద్భవ లాంటి పదాలు మనం చూస్తున్నవే. కులం అంటే గుంపు (గ్రూప్) అని అర్థం ఉండటంవల్ల, పూర్వం ఓ వంశం వారంతా తరతరాలుగా ఒకేచోట నివసించి ఉండటంవల్ల (ఇప్పటిలా పొట్ట చేతబట్టి ఊరుకాని ఊరు, దేశం కాని దేశాలు పోవటంలేదు కనుక) వారిని ఒక కులంగా వ్యవహరించి వుండవచ్చు. వాళ్ళతో సంబంధబాధవ్యాలు కలుపుకున్న ఇతర వంశీయులను కూడ "మనవాడే" అనటం ద్వారా "కుల" శబ్దం దృఢమై ఉండవచ్చు. మొత్తం మీద 'కుల' శబ్దానికి ఇప్పుడు వాడుకలో ఉన్న అర్థం మాత్రం అసలర్థం కాదు. వంశమనే అర్థం.

గోత్రం అంటే కులం కంటే కొంచెం విశాలమైంది. ఒక మూలపురుషుడి నుండి, లేదా కొద్దిమంది ప్రసిద్ధులైన మూలపురుషులనుండి వంశం లేదా కులం ఏర్పడుతుంది. వారి పేర్లు ప్రవరలో కనబడతాయి. ప్రసిద్ధులైన ఆయా ఋషుల వంశక్రమంలో పుట్టినవాడిని అని చెప్పుకోవటం ప్రవర చెప్పుకోవటమంటే. మన పూర్వీకులపట్ల మనకున్న గౌరవాన్ని ఆ చెప్పటం వ్యక్తపరుస్తుంది. మన వినయాన్ని కూడా సూచిస్తుంది. నేను అని చివర చెప్పుకుంటాం మందుకే.

ఒకే గోత్రంలో రెండుమూడు రకాల ప్రవరలుండవచ్చు. మూల ఋషినుండి విడివడి వేరే కులంగా ఏర్పడ్డ ఏకగోత్రీకులన్నమాట. రెండుకులాల కలయికతో రెండిటినీ ప్రతిబింబిస్తూ గోత్రాల పేర్లున్న సందర్భాలు వున్నాయి.

దైవం వద్ద, రాజుదగ్గర, గురువువద్ద, తల్లితండ్రులవద్ద, సన్యాసివద్ద గోత్రనామాలు చెప్పుకొని నమస్కరించటం సాంప్రదాయం. వారిని గౌరవిస్తూ మనం చిన్నవారమేనని ఒప్పుకుంటూ వినయాన్ని చూపటమది. అందుకనే గుళ్ళోను, పూజలవద్ద మనం గోత్రం, పేరు చెప్పుకుంటాం.

(మాయాబజార్లో యస్వీ రంగారావు ఎ ఎన్నార్ ని "పేరు చెప్పుకొని శరణు వేడుకోరా బాలకా" అన్న డైలాగు గుర్తొచ్చేవుంటుంది).

కులగోత్ర శబ్దాలకు వేరే అర్థాలున్నాయన్న ఉదాహరణకి ఓ శ్లోకం చెబుతాను.

"శమీపత్ర ప్రమాణేన పిండం దత్యాత్ గయాశిరే
ఉద్ధరేత్సప్త గోత్రాణి కుల మేకోత్తరం శతమ్"

గయలో జమ్మి ఆకంత పిండం వేసినా, అది ఏడు గోత్రాలని, నూటొక్కతరాల కులాన్ని ఉద్ధరించినట్లవుతుంది.

ఏడు గోత్రాలంటే మనతండ్రి గోత్రం, తల్లిగోత్రం, అమ్మమ్మ, తాతమ్మ, నాన్నమ్మ, ఇలా ఆడవారి పుట్టింటి గోత్రాలతో సహా మనకు సంబంధించిన ఏడుగోత్రాలవారని అని అర్థం. మనవంశం 101 తరాలు ఉద్ధరించబడుతుంది అని భావం. అందుకనే శ్రాద్ధకర్మలప్పుడు, ముఖ్యంగా పిండప్రదాన సమయంలో పురోహితులు మనచే "గయేయం గయేయం" (ఇది గయయే) అనిపిస్తారు. గయలో పిండం వేస్తున్న భావనతో చేయాలి ఎక్కడ చేసినా.

ఇంతకీ గోత్రం తెలియని వారి పరిస్థితి ఏమిటి?

పితృదత్తమైన గోత్రం లేనివారు, తెలియనివారు గురుదత్తమైన గోత్రాన్ని తనగోత్రంగా స్వీకరించటం ఉంది. గురువు గోత్రాన్ని తన గోత్రంగా స్వీకరించటమూ ఒక పద్ధతి. గురువు ఇచ్చిన గోత్రాన్ని తీసికొని నాటినుండి తన వంశం ఆగోత్రంతో వ్యవహరించబడేలా చూడటం మరొక పద్ధతి. ఇటీవల తగ్గింది కాని, 30-40 ఏళ్ళక్రితం వరకు ప్రతీ పల్లెకు

రామానుజ, శంకరాది సాం్రపదాయకులైన గురువులు ప్రతియేటా వచ్చి తమతమ శిష్యులకు మహామంత్రాలనుగ్రహించటం, చక్రాంకితులను చేయటం, పేర్లుపెట్టటం, అక్షరాభ్యాసాల్ని చేయటం, వార్షికాలను అందుకోవటం లాటివి వున్నాయి. ఇంతకీ ఈగురువులు గోత్రాలను గుర్తు చేయటమో, ఇవ్వటమో చేసేవారు. తమతమ శిష్యుల తాతముత్తాతలపేర్లు వారు రాసుకున్న పుస్తకాల్లోవి చెప్పేవారు. కొందరు గ్రామపురోహితులు కూడా ఈ పని నిర్వర్తించేవారు.

ఇవన్నీ పోయిన ఈ రోజుల్లో గోత్రం తెలియనివారి పరిస్థితి ఏమిటి? దానికీ ఓ ఉపాయం వుంది. అందరిదీ "కాశ్యప"గోత్రమే. పరశురాముడు 21సార్లు భూప్రదిక్షిణచేసి, రాజులందర్నీ ఓడించి, భూమినంతటినీ జయించి కాశ్యపునికి దానమిచ్చాడు. అప్పటినుండి భూమి కాశ్యపి అయింది. మనమంతా కాశ్యపులమయ్యాము. కనుక ఎవరైనా "కాశ్యపస" గోత్రం అని చెప్పుకోవచ్చు.